క్లుప్తంగా

దత్తతపై అవగాహన

భద్రాచలంఅర్బన్: డబ్ల్యూసీడీ వేర్ ఆర్ ఇండియా చిల్డ్రన్ అనే ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో పిల్లల దత్తతపై సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ గాదె ప్రేమలత రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ పద్మ శ్రావణిలు కలిసి దత్తత ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. శనివారం భద్రాచలంలోని రాఘవ నిలయంలో జరిగిన శిక్షణలో కార్యక్రమంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ ఇన్‌చార్జ్‌లకు పిల్లల దత్తత, అందులోని రకాలు, దత్తత తీసుకున్న తర్వాత, తీసుకోకముందు ఉండే నియమాలు, హక్కులతో పాటు జేజే యాక్టు, జేజే మోడల్ రూల్స్ చట్టాలపై క్షుణ్ణంగా వివరించారు. సీడీపీఓ జయలక్ష్మి, సీడీపీఓ హరికుమారి, స్పెషల్ లైసెడ్ అడాప్షన్ ఏజెన్సీ మేనేజర్ చంటిబాబు, పీఓఐసీ వినోద్ కుమార్, పీవోఎన్‌ఐసీ శేషయ్య, ఎల్‌సీపీఓ శివకుమారి, జిల్లా నలుమూలల నుంచి చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ సభ్యులు ఇన్‌చార్జ్‌లు, లీగల్ అడ్వైజర్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు..

అశ్వాపురం: రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-17 బాలుర హాకీ పోటీలకు మండలంలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం.రాము, ఎస్.ప్రణయ్‌కుమార్, ఎం.మోహన్ ప్రతిభ కనబరిచి వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం రామారావు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఏటీడీఓ నర్సింహారావు, ఉపాధ్యాయులు వీరస్వామి, కిషన్, సీతారాములు, ఎల్.భద్రు, కృష్ణారావు, అభినందించారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ

గుండాల: మండల పరిధిలోని కాచనపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వాముల ఆలయాలను శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో పునఃప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐలు ఆలయాల పునఃప్రతిష్ఠింపన చేసేందుకు ముందుకు రావడంతో శనివారం యాదాద్రికి చెందిన వేద పండితులతో కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ దీప దూప నైవేద్యం సమర్పించాలని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి రావాలని పండితులు సూచించారు. గత కొద్ది సంవత్సరాలుగా నిత్యపూజలు, దూపదీప నైవేద్యాలు లేక ఆలయాలను మూసివేయడంతో గ్రామానికి అరిష్టత ఏర్పడుతుందని వేదపండితులు తెలపడంతో గ్రామస్తులు సంఘటితమై ఆలయాలను పునఃప్రతిష్ఠింపజేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగాఆలయ ప్రతిష్ఠకు సహకరించిన సీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈఓ సాయి శ్రీనివాస్-సౌమ్య దంపతులను, ఎన్‌ఆర్‌ఐ శ్రావ్య (యూఎస్‌ఏ), డాక్టర్ కొండ ప్రదీప్ కుమార్తో పాటు, అన్నదాతలు కోయల్కర్ రాకేష్, మందపూరి సాయి బాబు దంపతులను ఆలయకమిటీ సభ్యులు పట్టు శాలువాతో ఘనంగా సత్కరించారు.

చెత్త తొలగించాలి

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు లింగంపల్లి రమేష్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని సీఎస్పీ ప్రాంతంలో డంపింగ్ చేయడంతో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శనివారం బీజేపీ నాయకులు చూపిస్తూ.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు ఎంతోమంది ఈ రహదారి మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారని, పేరుకుపోయిన చెత్తాచెదారం, వచ్చే దుర్వాసనతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

కోదండరాంను కలిసిన జేఏసీ నాయకులు

అశ్వారావుపేటరూరల్: ప్రొఫెసర్ కోదండరాంను అశ్వారావుపేటకు చెందిన జేఏసీ నాయకులు శనివారం సత్తుపల్లిలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. సత్తుపల్లిలోని కళాభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరు కాగా స్థానిక జేఏసీ బాధ్యులు కలిసి అశ్వారావుపేటలో ఆర్‌డీఓ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, అలాగే సత్తుపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయించి అశ్వారావుపేట, దమ్మపేట మండలాలను కలిపే విధంగా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు గుర్తింపు, 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గోగినపల్లి ప్రభాకర్, జి.లక్ష్మీనర్సు గౌడ్, ఎస్‌కె.పకీర్, కె.మాధవరెడ్డి, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీలో వాకింగ్ ట్రెండ్

- నడకపై దృష్టి పెడుతున్న స్థానికులు
- ఆరోగ్య పరిరక్షణపై పెరిగిన అవగాహన



సిద్ధమవుతున్న క్రీడా మైదానం..



వాకింగ్ చేస్తున్న ఏజెన్సీ వాసులు..

సండే స్పెషల్

దుమ్ముగూడెం: ప్రజల్లో మారిన ఆహారపు అలవాట్లకు ఒంట్లో కొవ్వు పెరిగి శరీరాకృతి మారి అనారోగ్యాలకు గురవుతున్న తరుణంలో ప్రజలు నడకపై దృష్టి పెడుతున్నారు. అయితే ఈ ట్రెండ్ తాజాగా ఏజెన్సీ పల్లెలకు వచ్చేసింది. నడక వల్ల చాలా ఉపయోగకరాలు ఉన్నాయని వైద్యులు సూచించడంతో చిన్నా.. పెద్దా తేడా లేకుండా అందరూ వడివడిగా అడుగులేస్తున్నారు. గతంలో నడక పట్టణాల్లోని క్రీడా మైదానాలు, పార్కులకే పరిమితం కాగ మారిన పరిస్థితులకు అనుగుణంగా ఏజెన్సీలో సైతం రోడ్లపై నడక లకించుకుంటున్నారు. నడకతో పాటు ఆహారపు అలవాట్లు సైతం మార్చుకుంటూ ముందుకు వెళ్లతున్నారు ప్రజలు.

ఉపయోగాలెన్నో..

రోజు ఉదయం పూట లేదా సాయంత్రం దొరికిన సమయంలో వాకింగ్ చేయడం వల్ల ఎన్నోరకాలుగా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. కానీ ఉదయం పూట చేసే వాకింగ్ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నట్లు వైద్యులు చెప్పుతున్నారు. అలాగే మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఆలోచనల్లో స్పష్టత, సృజనాత్మకత పెరుగుతాయి. శరీరం, మనసు రెండింటికీ ఒకేసారి ప్రయోజనాన్ని ఇచ్చే వ్యాయామాల్లో వాకింగ్ ప్రధానమైంది. రోజుకి పదివేల అడుగులు నడవగలిగితే అది ఆరోగ్యవంతమైన జీవనశైలికి పునాదిగా మారుతుంది. అయితే నడకతో పాటు ఇతర వ్యాయామాలు కూడా చేయాలని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు వాకింగ్‌తో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చు. గుండె ఆరోగ్యానికి వాకింగ్ తప్పనిసరి అని గుండెవ్యాధుల నిపుణులు సలహా ఇస్తున్నారు. అంటే ఇతర వ్యాయామాలు చేసేవారు కూడా గుండె ఆరోగ్యం కోసం నడకను తప్పకుండా తమ ఫిట్‌నెస్ రొటీన్‌లో భాగం చేసుకోవాలి. వాకింగ్ వల్ల గుండె కండరాలు బలంగా తయారవుతాయి. శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం సైతం పెరుగుతుంది. బ్యాడ్ కొలస్ట్రాల్, డయాబెటీస్‌లను నియంత్రణలో ఉంచుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. రోజులో కనీసం 3 కిలో మీటర్ల నుంచి 5కిలో మీటర్ల వరకు.. కనీసం 45 నిమిషాలు పాటు పిచ్చాపాటి కబుర్లతో కాకుండా ఏకాగ్రతతో నడవాలని వైద్యులు సూచిస్తున్నారు.

త్వరలోనే క్రీడామైదానం..

ములకపాడు వైద్యశాల పక్కన ఉన్న 8 ఎకరాల్లో రూ.2.26కోట్ల నిధులతో నిర్మిస్తున్న క్రీడామైదాన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. క్రీడా మైదానం పూర్తయితే వాకింగ్ చేసే వాళ్లకు ఎంతగానో ఉపయోగకరంగా మారుతుంది. ఇక రోడ్లపై కాకుండా గ్రౌండ్‌లోనే నడకసాగించవచ్చు.

నడకతో ఎంతో మేలు..



స్పీడ్‌గా నడవడం వలన ఒంట్లో ఉన్న కొవ్వు పెరగకుండా ఉంటుంది దీంతో పాటు ఉదయం పూట నడక వలన ఎండ తగిలి విటమిన్ డి లభిస్తుంది గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చు కనీసం 3కిలో మీటర్లుకు పైగా నడిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

– డాక్టర్ పుల్లారెడ్డి, ములకపాడు

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దమ్మపేట: మండల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో 2024 ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని తహసీల్దార్ ముజాహిద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం మండల తహసీల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. జనవరి 1, 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందజేయాలని, లేనిపక్షంలో ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటుకు అర్హత కలిగిన యువతి, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోనేలా అవగాహన కలిగించాలని పార్టీ నాయకులను కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నశెట్టి యుగంధర్, ఎండి.వలీపాషా, యార్లగడ్డ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసింహావతారంలో పర్ణశాల రామయ్య



నరసింహావతారంలో ఉన్న రామయ్య..

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా శనివారం రామయ్యను నరసింహావతారంలో ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, నరసింహచార్యులు అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అర్చకులు.. అనంతరం స్వామి వారిని నరసింహావతారంలో అలంకరించారు. భూతగ్రహ బాధలు, కుజగ్రహ బాధలు ఉన్నవారు ఈ అవతారాన్ని పూజించడం వల్ల వాటి నుంచి విముక్తిని పొందుతారని అర్చకులు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.బంగారు లక్ష్మి వారి ఆధ్వర్యంలో రుక్మిణి కల్యాణం హరికథా నాటకం ప్రదర్శించారు. నేడు వామనావతారంలో దర్శనం ఇవ్వనున్న స్వామివారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరిండెంట్ కిషోర్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది శివ,రాము తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ మనుగడ సాధించాలంటే ఏఐటీయూసీని గెలిపించాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన ఓసీ-2, మణుగూరు ఓసీ, కేసీహెచ్‌పీలలో జరిగిన పిట్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ అండతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. కార్మిక సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. కొత్త బావులు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాట ఇచ్చి మోసం చేసిందన్నారు. సింగరేణి కార్మికులకు 250 గజాల స్థలంలో సొంతింటి నిర్మాణం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం, సింగరేణి స్కూళ్లల్లో సీబీఎస్ఈ బోధన తదితర డిమాండ్లు సాధించబడాలంటే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని ఆయన కార్మికవర్గానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ అడిషనల్ ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరి రాజ్‌కుమార్, బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఉపాధ్యక్షులు మల్లెల రామనర్సయ్య, నాయకులు మేకల ఈశ్వర్, జి పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరు శ్రీనివాసరావు, సురేందర్, సుభాని, గంగాధర్‌రావు, శ్రీనివాసరావు, రవికుమార్, సాయిప్రకాస్ చారి, సందీప్ కుమార్, వెంకటేశ్వర్లు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు గెలిపించాలి

సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సింగరేణి సంస్థ మనుగడ కోసం జరగబోయే గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని కార్మికులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి, సోమరాజులు విజ్ఞప్తి చేశారు. శనివారం కొండాపురం భూగర్భగని ఆవరణలో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో, హక్కులను సాధించడంలో టీబీజీకేఎస్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో గడియారం గుర్తుకు ఓటు వేసి ఐఎన్‌టీయూసీ గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు వెంకటరత్నం, సూరయ్య, దుర్గారావు, టి.శ్రీనివాస్, పెద్ద నాగయ్య, రాంశెట్టి కృష్ణచేతన్, భాగం రవి, తెప్పా శ్రీను, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



స్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మండల కేంద్రంలో కొలువుదీరిన బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నేటి (ఆదివారం)నుంచి జనవరి 15వ తారీకు వరకు ధనుర్మాస, వైకుంఠ ఏకాదశి, అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నారు. 17వ తారీకు నుంచి 30వ తారీకు వరకు ప్రతి రోజూ ఆలయంలో సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, నిత్యపాశుర విన్నపానం, 31వ తారీకు నుంచి 15 వ తారీకు వరకు శ్రీగోదమ్మ వారి గ్రామ సేవ, స్వామి వారి గ్రామసేవ నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తారీకు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారి ఉత్తరద్వార దర్శనం, గరుడ సేవ, 15వ తారీకు శ్రీగోదారంగనాథుల కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను జరిపించనున్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ మేనేజర్ రమణ కోరారు. ఉత్సవాలకు ఆలయాన్ని అధికారులు ముస్తాబు చేశారు.

రహదారి పనులు అడ్డగింత

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డు నుంచి చింతిర్యాల వెళ్లే దారిలో సీసీ రోడ్డు పనులను శనివారం చింతిర్యాల కాలనీ, సంద్రలబోడు సర్పంచ్‌లు పాయం భద్రయ్య, కుంజా రామారావు, స్థానికులు అడ్డుకున్నారు. చింతిర్యాల రహదారి మార్గంలో గ్రామానికి వెళ్లే రహదారి మార్గం కన్నా గొల్లగూడెం నుంచి దుమ్ముగూడెం ఆనకట్ట వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు ఎత్తైన ప్రదేశంలో నిర్మిస్తున్నారని స్థానికులు రహదారి పనులను అడ్డుకున్నారు. అడ్డుకున్న వారిలో కాంగ్రెస్ నాయకులు యక్కటి పున్నారెడ్డి, పుల్లారెడ్డి, సతీష్, అనిల్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

అధ్యక్షుడిగా జయరాజు

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దళిత ప్రజా సంఘం అధ్యక్షుడిగా భద్రాచలం పట్టణానికి చెందిన అల్లాడి జయరాజును నియమిస్తూ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నంకొండ నియామకపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. జిల్లాలో దళితుల అభివృద్ధికి పోరాటాలు చేసి దళిత ప్రజా సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్ని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం మండల కేంద్రం దమ్మపేట గ్రామంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో అయ్యప్పల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. జగ్గారం గ్రామంలో సున్నం కృష్ణ తండ్రి మరణించగా మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, యార్లగడ్డ బాబు, గాజుబోయిన యేసు, పానుగంటి చిట్టిబాబు, యార్లగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు వనభోజనాలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘ వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు ఏఎం చారి, శంకరాచారి, నరసింహచారిలు తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు మణుగూరు పరిసరాల విశ్వబ్రాహ్మణులకు ఆహ్వానం అందించారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

దుమ్ముగూడెం: కూరగాయల ధరలు కొండెక్కడంతో వినియోగదారులు బెంబేలేత్తిపోతున్నారు. మొన్నటి వరకు కార్తీకమాసం కావడంతో కాయగూరలకు బాగా డిమాండ్ పెరిగి ధర కూడా పెరిగింది. కానీ కార్తీకమాసం పూర్తయినప్పటీ ధరలు తగ్గడం సరికదా.. అప్పటికంటే కేజీకి రూ.10 నుంచి 15 వరకు పెరగాయి. దీంతో కూరగాయాలను సామాన్య మానవుడు కోనే పరిస్థితి లేకుండా పోయింది. మిచాంగ్ తుఫాన్ వల్ల ఆంధ్రా ప్రాంతంలో కాయకూరల తోటలకు నష్టం రావడంతో దిగుమతి దగ్గింది. ఇందువల్లే ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. ఏ కూరగాయాలు కొనాలన్నా కేజీ రూ.60కి పైమాటే ఉంది. అదీ, ఇదీ అని లేదు దాదాపు అన్ని కూరగాయల ధరల్లోనూ భారీ పెరుగుదల కనిపిస్తోంది. కూరల్లో సామాన్యులు ఎక్కువగా వినియోగించే వంకాయల ధరలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే కొన్ని రకాలు కిలోకు దాదాపుగా రూ.10 నుంచి రూ.15ల వరకూ ధరలు పెరగడం గమనార్హం. దీంతో సాధారణ ప్రజానీకంతో పాటు మధ్య తరగతి వర్గాలు వారు కూరగాయలు కిలోల చొప్పున కొనే పరిస్థితి కనిపించడంలేదు. కిలో కొనే చోట పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయల ధరలు ఇప్పట్లో తగ్గుముఖం పట్టే అవకాశం లేదని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. మరికొన్నాళ్లపాటు ధరాఘాతం తప్పనట్లుంది.

పరుగు పోటీలు ప్రారంభం

దమ్మపేట: జిల్లా క్రాస్ కంట్రీ పరుగు పందెం చాంపియన్‌షిప్ పోటీలను, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. శనివారం అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో పోటీలను ప్రిన్సిపాల్ తోలెం వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. పోటీలో 70 మంది అథ్లెటిక్స్ పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు, ఈ నెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక అవుతారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహీధర్ తెలిపారు. కాకా అనూష, పీఈటీ రవి, కోచ్‌లు నాగేందర్, కృష్ణ, గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

నమ్మండి.. ఇది బీటీ రోడ్డే!



మట్టి గడ్డలతో కచ్చారోడ్డుగా కనిపిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి..

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులు మట్టి కుప్పలతో నిండిపోతున్నాయి. రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి గడ్డలు పేరుకుపోయి ఆటో వాలాలు, ద్విచక్రవాహనదారులు, సైక్లిస్టులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో రైతులు ముమ్మరంగా వరి కోతల పనులు చేపట్టారు. ఈ క్రమంలో వరి కోతలు కోస్తున్న యంత్రాలను వాటి యజమానులు ప్రధాన రహదార్ల పైనే నడిపిస్తున్నారు. వరి చేలల్లోని మట్టి అంతా యంత్రాల బెల్ట్‌కు చుట్టుకొని ఆ యంత్రాలు రోడ్డు పైకి వచ్చినప్పుడు మట్టిగడ్డలు, బురద అంతా రోడ్డుపైనే పడుతోంది. ఈ క్రమంలో రోడ్డు మొత్తం మట్టిగడ్డలతో నిండిపోతోంది. వాటిని తొలగించేందుకు సంబంధిత యజమానులు గానీ, ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు, సిబ్బంది గానీ చొరవ చూపడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడం షరామామూలైపోయింది. వెంటనే ఆర్ అండ్‌బీ శాఖాధికారులు స్పందించి ఈ ప్రమాదాల తీవ్రత పెరగక ముందే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేధింపులను మనోధైర్యంతో ఎదుర్కోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్వేత

అశ్వారావుపేటరూరల్: విద్యార్థినులు, మహిళలు లైంగిక వేధింపులను మనోధైర్యంతో ఎదుర్కోవాలని, భయందోళనకు గురి కావద్దని న్యాయవాది, బార్ కౌన్సిల్ సభ్యురాలు శ్వేత అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం 'పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. భారతీయ శిక్షస్మృతిలో లైంగిక వేధింపులకు అధిక ప్రాధాన్యత కల్పించారని, అనేక చట్టాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ వేధింపులను మహిళలు, విద్యార్థినులు ఏ విధంగా ఎదుర్కొవాలి అనే విషయాల గురించి వివరించారు. ఏడీ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. వేధింపులపై కళాశాల యాజమాన్యం కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటుందని అన్నారు. స్త్రీల రక్షణ బృందం అధ్యక్షురాలు డాక్టర్ నాగాంజలి, ప్రొఫెసర్లు పావని, నీలిమా, శిరీష, రెడ్డిప్రియ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం..



మాట్లాడుతున్న నాయకుడు బాలరాజు

మణుగూరురూరల్: సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిలబడి బీజేపీ పోరాడుతుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పాడియం బాలరాజు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో గిరిజనుల, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, కొంత మంది నాయకులు భూదందాలు పాల్పడి వారి భూములను దోచుకున్నారని ఆరోపించారు. పేద గిరిజనుల భూములను, ప్రభుత్వ భూముల పరిరక్షణకు బీజేపీ కృషి చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ ముందుకు సాగుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణం పథకం వల్ల ఆటోడ్రైవర్ల బతుకులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆటోడ్రైవర్లకు ట్యాక్స్‌లలో మినహాయింపు ఇవ్వాలని, ఆటో పరికరాల ధరలను అందబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు, లింగంపల్లి రమేష్, కామసాని మధుసూధన్, బత్తిని సాంబశివరావు, కట్ట నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.